# చివరకు మిగిలింది

"దీపావళి సెలవుల్లో ఎక్కడికెళదాం?" భార్య నడిగాడు నరేంద్ర.

"వేసవిలో బాగుంటుంది కదండీ" సుమన తన అభిప్రాయం తెల్పింది.

"వేసవిలో ప్రయాణం అంటే చిరాకు నాకు. ఎక్కడ చూసినా ఎండలు, నీటికొరత, దానికితోడు రద్దీ. అయినా నా ఎల్.టి.సి. టెర్మ్ డిసెంబరులో ముగుస్తుంది."

"అయితే ఊటీ వెళదాం. ఎన్ని సంవత్సరాల నుండో అనుకుంటున్నాం."

"అవును, అక్కడి నుండి మైసూరు, బెంగుళూరు, తిరుపతి మీదుగా ముంబాయి తిరిగి వద్దాం. ఈరోజే మావాళ్లకి రాస్తాను."

"మీ వాళ్ళని కూడా తీసికెళదామా?" సుమనలో ఉత్సాహం తగ్గింది.

"ఏం? వాళ్లు మాత్రం మనుషులు కారా? వాళ్ళకి సరదాలుండవా?"

"అది కాదండీ, ఎనిమిది మందితో ప్రయాణం అంటే కష్టం. టిక్కెట్లు, రిజర్వేషన్లు, భోజనం, బస, చాలా ఇబ్బందవుతుంది."

"ప్రయాణమన్నాక ఇబ్బందులుంటాయి. అలా అని మానుకుంటామా?"

"బ్యాంకులో చేరి పన్నెండు సంవత్సరాలు అయినా ఒక్కసారి కూడా మావాళ్ళని ఎల్.టి.సి.లో తిప్పింది లేదు. మనం వచ్చి సంవత్సరం అయినా ఇంకా మా వాళ్లు ఇక్కడకు రాలేదు. ఈ నెపంతోనైనా వాళ్లు ముంబయి చూస్తారు."

నరేంద్ర ఓ జాతీయ బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. ప్రమోషన్‌పై ముంబయి వచ్చాడు.

"చూపించడానికేం. చాలా వున్నాయి. మరి ఖర్చులో?"

"ఖర్చు గురించి నీవేం బెంగ పెట్టుకోనక్కర్లేదు. మా వాళ్లని తీసుకెళ్తుంది ఖర్చులు కల్పివస్తాయనే."

"అదెలాగో?"

"మా అసోసియేషన్ ఒప్పందం ప్రకారం మనం సెకండ్ క్లాసులో వెళ్లినా, సెకండ్ ఏ.సి. బాడుగ ఇస్తారు. అంటే మన ప్రయాణ టిక్కెట్లకు నాలుగింతలు వస్తాయన్నమాట. ఎన్ని ఎక్కువ టిక్కెట్లుంటే అంత అదనపు లాభం. కుటుంబం అంతా వెళితే ఖర్చులు పోను కొంత గిట్టుబాటు కూడా అవుతుంది."

"స్వార్థంతో పాటు పరమార్థం కూడా సాధిస్తారన్నమాట. ఎంతైనా మీది కామర్సు బుర్ర కదా!" ఎం.కామ్. భర్తకు చురకనంటించింది సుమన.

అనుకున్నట్లుగా తల్లిదండ్రులను, తమ్ముణ్ని, చెల్లాయిని ముంబాయి రప్పించుకున్నాడు

నరేంద్ర. టూరిజం వారి బస్సులో వెళ్లి రెండు రోజులు ముంబయి చూసారు. ఆ తర్వాత ఊటీ వెళ్లారు. అక్కడినుండి మైసూరు, బెంగుళూరు, చుట్టుపక్కల పర్యాటక స్థలాలైన బేలూరు, హళిబీడు, శ్రావణబెళగోళ చూసి తిరుమల చేరుకున్నారు. శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకున్నారు. క్యాంటీన్లో భోంచేసి ఒంటిగంట వరకు కాటేజికి చేరుకున్నారు. ఎనిమిది రోజులు తీరిక లేకుండా తిరగడంతో అలసిపోయారు. పెద్దవాళ్లయితే దస్సిపోయారు. అలా పక్కలమీద పడ్డారో లేదో, ఒళ్లెరుగకుండా నిద్రపోయారు. దాదాపు అయిదు గంటలకు లేచి టీ తాగి తీరిగ్గా కూర్చున్నారు.

"యాత్ర బాగా జరిగింది కదమ్మా?" ప్రయాణపు ఏర్పాట్లు పకడ్బందీగా చేశానని మురిసిపోతున్న నరేంద్ర తల్లినడిగాడు.

"ఏం యాత్రనో నాయనా. మా రోజుల్లో యాత్రంటే కాశీయో, రామేశ్వరమో వెళ్లేవారు. మీ నాన్న చూపించకున్నా, నీవైనా అవి చూపిస్తావనుకున్నాను. చెట్లు, చేమలు చూడటానికి ఇంతింత ఖర్చు చేసుకుని, రైళ్లు, బస్సులు మారి నానా హైరానా పడాలా? ఇంట్లో ఉన్న సుఖం కాశీకి పోయినా దొరకదని ఊరికే అన్నారా?"

పొంగుమీద నీళ్లు చల్లినట్లయింది నరేంద్రకు.

అన్యమనస్కంగా బయటికి వెళ్లాడు.

తిరుపతి నుండి తన వాళ్లని ఊరికి రైలెక్కించి ముంబయి వచ్చాడు నరేంద్ర, భార్యాపిల్లలను తీసుకుని.

ప్రయాణంలో అత్తాకోడళ్లు చిన్న చిన్న విషయాలపై గిల్లికజ్జా పెట్టుకున్నారు.

పోటీలుపడి, అవసరంలేకున్నా ఎన్నో వస్తువులు కొనుక్కున్నారు ఇద్దరూ. వీటిని తీసుకుని నరేంద్ర, సుమనల మధ్య పెద్ద వాగ్యుద్ధమే జరిగింది.

భార్యా, తల్లి మధ్య సయోధ్యకు దారి తీస్తుందనుకున్న ప్రయాణం, వైషమ్యాన్ని ఇంకా పెంచింది. తరాల మధ్య అంతరాలు అంత సులభంగా తగ్గిపోవని తెలిసింది. యాత్రా స్పెషల్ టిక్కెట్లు తీసి తల్లిదండ్రులను వేరుగా పంపాలిగాని, తమతో ఇంకెప్పుడూ తీసికెళ్ళకూడదని నిశ్చయించుకున్నాడు నరేంద్ర. ఎల్.టి.సి. డబ్బులకు కక్కుర్తిపడితే తగిన శాస్తి జరిగింది.

ఎంతో శ్రమపడి, ఖర్చుకు వెనుకాడకుండా చేసిన విహారయాత్ర విషమయాత్రగా పరిణమించింది. తాననుకున్న స్వార్థం, పరమార్థం రెండూ సాధ్యం కాలేదు.

చివరకు మిగిలింది?